ప్రజాశక్తి
బుధవారం 14 మే 2025 5
అనంతపురం





మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్.జగన్మోహన్‌రెడ్డి

కార్పొరేట్ బడి.. ఫీజుల దోపిడీ..!



నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతోంది. జూన్ 12 నుంచి విద్యా సంస్థలు పున:ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థల కాసుల వేట ప్రారంభించాయి. ధనార్జనే ధ్యేయంగా తల్లిదండ్రుల ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఫీజులు, డొనేషన్లు తదితర కొత్తకొత్త పేర్లతో సొమ్ములు వసూలు చేస్తున్నాయి. నియంత్రణ లేని ఫీజుల వసూళ్లపై అధికారులు కనీసంగానైనా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ప్రయివేటు యాజమాన్యాల తీరు ఆడింది ఆట పాడింది పాటగా మారింది. ఇప్పటికే వేలు, లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుండగా ఈ ఏడాది మళ్లీ 10 నుంచి 30 శాతం ఫీజులను పెంచి వసూలు చేసేలా నిర్ణయం తీసుకున్నాయి.

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

- ప్రయివేటు, కార్పొరేట్ కాసుల వేట..!
- పుస్తకాలు, యూనిఫాం ధరల పెంపు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- కొరవడిన అధికారుల నియంత్రణ

అనంతపురం జిల్లాలో 670 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 17,0,076 మంది ఏటా చదువుతున్నారు. పలు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండానే ఆయా యజమాన్యాలు పబ్బం గడుపుతున్నాయి. విద్యా ప్రమాణాలకు నీళ్లు వదులుతూ దారుణంగా ఫీజులు పెంచి వసూలు చేస్తున్నారు. అధిక ఫీజులపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. తమ పిల్లలు బాగా చదవాలన్న ఆశతో కార్పొరేట్ పాఠశాలకు వెళ్తున్న పేద, మధ్యతరగతి వర్గాలకు తల్లిదండ్రులకు చదువు భారంగా మారుతోంది.

యథేచ్ఛగా నిబంధనలు అతిక్రమణ

ప్రయివేటు కార్పొరేట్ విద్యా సంస్థలు యథేచ్ఛగా నిబంధనలను అతిక్రమిస్తున్నారు. సరైన వసతులు కల్పించకుండానే విద్యా సంస్థలను నడుపుతున్నారు. అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం సేఫ్టీ ప్రమాణాలను పక్కన పెడుతున్నాయి. పరిమితికి మించి విద్యార్థులను తరగతి గదుల్లో ఉంచుతున్నారు. అనేక పాఠశాలలకు ఆట స్థలం లేని దుస్థితి ఉంది. బస్సుల్లో విద్యార్థులను కుక్కి మరీ నడిపిస్తున్నారు. దూరంతో సంబంధం లేకుండానే రవాణా ఛార్జీలను భారీగా వసూలు చేస్తున్నారు. ఇలా అనేక నిబంధనలను తుంగలోకి తొక్కి వ్యవహరిస్తున్న పరిస్థితి ఉంది.

ఫీజుల మోత..

తమ పాఠశాలల్లో చేర్పించండి అంటూ పదేపదే ఇళ్లకు తిరిగిన యాజమాన్యాలు తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి వారి పాఠశాలల్లో పిల్లల్ని చేర్చుకుంటున్నారు. పాఠశాలల్లో చేర్చుకునేంత వరకు బాగానే ఉన్నా తర్వాత అసలు బాదుడు మొదలవుతోంది. ఫీజులకు సంబంధించి ప్రభుత్వం కొన్ని నిబంధనలను నిర్దేశించింది. జిల్లాలో ఇవి ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం చెప్పిన ధరలకు నాలుగు నుంచి ఐదు రెట్లు, కొన్ని కార్పొరేట్ పాఠశాలలు అయితే ఏకంగా పది రెట్లు పెంచి వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. ప్రతి సంవత్సరం రూ.10 వేల నుంచి రూ.20 వేలు పెంచి వసూలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కొన్ని యాజమాన్యాలు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి .



నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు

ప్రవేటు కార్పొరేట్ పాఠశాలలు పుస్తక విక్రయ వ్యాపార కేంద్రాలుగా మారాయి. యూనిఫాం, బూట్లు టై, పుస్తకాల పేరుతో దోపిడీ సాగుతోంది. పుస్తకాలకు రూ.5వేలు నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వీటిని విద్యాసంస్థల్లో విక్రయించకూడదు. బహిరంగా మార్కెట్లో దొరికే వాటి కన్నా పది రెట్లు అధిక ధరలు వసూలు చేస్తుండం గమనార్హం. తమ వద్ద తప్పా ఎక్కడా కొనేందుకు వీల్లేదనే నిబంధన పెట్టి ఎక్కువ ధరకు అమ్మకాలు చేస్తున్నారు.

కొరవడిన నియంత్రణ

నిబంధనలు పాటించకుండా నడుపుతున్న విద్యాలయాలపై సంబంధిత అధికారులు తనిఖీలు చేయాల్సి ఉంది. ఆ మేరకు విద్యా శాఖ, ఇతర అధికారులు స్పందించిన దాఖలాలు నామమాత్రమే. తల్లిదండ్రులు ఎక్కడైనా ఫిర్యాదు చేసినా తూతూమాత్రంగా తనిఖీలు చేసి మిన్నకుండిపోతున్నారు. విద్యార్థి సంఘాలు ఆధారాలతో సహా విద్యాశాఖ అధికారులకు ప్రయివేటు, కార్పొరేట్ దోపిడీపై ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యంగా ఉంటున్నాయి.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

కార్పొరేట్, ప్రయివేటు విద్యాలయాల్లో ఫీజుల దోపిడీ కొనసాగుతోంది. అధికారులు దీనిపై ఏమాత్రం స్పందించడం లేదు. ఆధారాలతో సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదు. నిబంధనలు పాటించకున్నా ఫీజులను మాత్రం లక్షల్లో వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాంను పాఠశాలల్లోనే విక్రయిస్తున్నారు. వీటిపై ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలి.

ఓతూరు పరమేష్,
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

గుర్తుండిపోయేలా..

మురళీనాయక్ జీవితం..!

- దేశం తనను ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది
- మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి
- మురళీనాయక్ కుటుంబానికి రూ.25 లక్షల సాయం

ప్రజాశక్తి-అనంతపురం, గోరంట్ల



మురళీనాయక్ తల్లిని ఓదారుస్తున్న జగన్

అతి చిన్న వయస్సులోనే దేశ రక్షణ కోసం తన ప్రాణాలను అర్పించిన వీర జవాను మురళీ నాయక్ జీవితాన్ని దేశ ప్రజలందరూ తమ గుండెల్లో చిరకాలం గుర్తుంచుకుంటారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జమ్ము కాశ్మీర్ వద్ద భారత్, పాకిస్తాన్‌ల మధ్య జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. బెంగుళూరులోని తన నివాసం నుంచి రోడ్డు మార్గం ద్వారా శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చేరుకున్నారు. నేరుగా మురళీనాయక్ ఇంటికి వెళ్లి అతని తల్లిదండ్రులు శ్రీరామ్‌నాయక్, జ్యోతిబాయిలను పరామర్శించారు. మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ సరిహద్దులో జరిగిన కాల్పులు, మురళీ నాయక్ మరణించిన తీరు తదితర వివరాలను తల్లిదండ్రులతో అడిగి తెలుసుకున్నారు. దేశ కోసం ప్రాణాలు అర్పించే కుమారున్ని కన్న తల్లిదండ్రులు గొప్పవారంటూ శ్రీరామ్‌నాయక్, జ్యోతిబాయిలను ఓదర్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ సరిహద్దులో శత్రువులను నిలువరించేందుకు వీర జవాను మురళీ చూపిన తెగవ మరువలేనిదని చెప్పారు. చిన్న వయస్సులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆయన తెగువ దేశం ఎప్పటికీ గుర్తించుకుంటుందని తెలియజేశారు. ఆయన ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. జవాను కుటుంబానికి వైసిపి అన్ని విధాలా అండగా ఉంటుందని తెలియజేశారు.

రూ.25 లక్షల ఆర్థిక సాయం

వీర జవాను మురళీ కుటుంబానికి వైసిపి తరుపున రూ.25 లక్షలు అందిస్తున్న జగన్మోహన్‌రెడ్డి తెలియజేశారు. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు ఇచ్చేలా గత వైసిపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దానికి కొనసాగింపుగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం మురళీ నాయక్ కుటుంబానికి రూ.50 లక్షలు, ఇతర సదుపాయాలు అందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు కెవి.ఉషశ్రీ చరణ్, మాజీ ఎమ్మెల్యేలు శంకరనారాయణ, అత్తార్ చాంద్‌బాషా, వై.విశ్వేశ్వర రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, కదిరి వైసిపి సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ పాల్గొన్నారు.

అధికారులతో చర్చలు విఫలం

శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె కొనసాగింపు



చర్చల సందర్భంగా అధికారులతో మాట్లాడుతున్న జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెండింగ్ వేతనాలు, పిఎఫ్, ఇతర న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు గత 38 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఇందులో భాగంగా కార్మికులు, సిఐటియు నాయకులతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంగళవారం నాడు చర్యలు జరిపారు. అయితే కార్మికులకు అనుకూలంగా వారి న్యాయమైన సమస్యల పరిష్కారంపై అధికారుల నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో చర్చలు విఫలం అయ్యాయి. ఆర్డీవో కేశవ నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీధర్ రావు, డివిజన్ ఇంజనీర్ డి.శిరీషా, కూడేరు ఇన్‌ఛార్జి తహశీల్దార్ మహబూబ్ బాషా సమక్షంలో చర్చలు జరిపారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు చర్చల్లో పాల్గొని కార్మికుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శ్రీరామరెడ్డి కార్మికులకు ఆరు నెలలు బకాయి జీతాలు చెల్లించాలన్నారు. 30, 40 నెలలు ఈపీఎఫ్‌ను పూర్తిగా ఇవ్వాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించన తర్వాతే సమ్మె విరమిస్తామని స్పష్టం చేశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ ఈ నెల 17వ తేదీన మూడు నెలల వేతనాలు, 30న పిఎఫ్ డబ్బులు చెల్లిస్తామని చెప్పారు. దీనికి కార్మికులు అంగీకరించలేదు. ఇలా మూడుసార్లు వేతనాలు ఇస్తామని తేదీలు ప్రకటించారే తప్పా డబ్బులు ఇవ్వలేదన్నారు. వేతనాలు ఇచ్చిన తర్వాతనే సమ్మెను విరమిస్తామని అధికారులకు తేల్చిచెప్పారు. దీంతో చర్చలు విఫలం అయ్యాయి. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా యూనియన్ అధ్యక్షులు స్వామి, కార్యదర్శి రాము, వన్నూరు స్వామి, నాగరాజు, కొండారెడ్డితో పాటు దాదాపు 200 మంది కార్మికులు పాల్గొన్నారు.

ప్రముఖుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



కలెక్టర్ వి.వినోద్‌కుమార్

రాష్ట్ర గవర్నర్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి, శాసనసభ స్పీకర్, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి తదితరులు అనంతపురం జిల్లా పర్యటనకు రానున్నారని, ఇందుకోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్న, రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ తదితరులు జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయా శాఖల జిల్లా అధికారులు, జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావుతో కలిసి మంగళవారం నాడు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఈనెల 17వ తేదీన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ జెఎన్‌టియు స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం పరిశీలన బాధ్యతలను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ చూస్తారన్నారు. 16వ తేదీన డ్రస్ రిహార్సల్స్ చేయాలని, అడ్వాన్సుడ్ సెక్యూరిటీ లైయిజన్ (ఏఎస్ఎల్) కార్యక్రమం నిర్వహించాలన్నారు.

ఈనెల 15, 16, 17వ తేదీలలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ జిల్లాలో పర్యటించనున్నారని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. 15వ తేదీన మధ్యాహ్నం హెలికాప్టర్ ద్వారా గుత్తి పట్టణంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు మంత్రి చేరుకుంటారని, అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని అదేరోజు రాత్రికి గుత్తి మండలం బేతపల్లి గ్రామంలో బస చేస్తారన్నారు. 16వ తేదీన ఉదయం 10 గంటలకు గుత్తి మండలం బేతపల్లి గ్రామం వద్ద రెన్యూ విండ్ ఎనర్జీ (జెఎఎంబి) ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారన్నారు. అదే రోజు అనంతపురంలో ఒక వివాహ కార్యక్రమానికి హాజరవుతారన్నారు.

16వ తేదీన కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్న, రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, తదితరులు జిల్లా పర్యటనకు రానున్నారని, ఈ కార్యక్రమాలకు సంబంధించి ప్రోటోకాల్ ఇతర ఏర్పాట్లు పటిష్టంగా చేయాలన్నారు. ఒక్కొక్కరికి ఒక బృందం ఉంటూ వీరి పర్యటనలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఒ ఏ.మాలోల, ఆర్డీవో కేశవ నాయుడు, టౌన్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, తహసీల్దార్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

గోనిపేట ప్రధానరోడ్డు పక్కన ఉన్న ఇటుకల బట్టీ



సిమెంటు, ఫ్లయాష్ ఇటుకలు అందుబాటులోకి వచ్చినా మట్టి ఇటుకలనే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. దీంతో ఇటుకల వ్యాపారానికి డిమాండ్ పెరిగింది. దీంతో పచ్చని పొలాలు ఇటుక బట్టీలుగా మారిపోతున్నాయి. చెరువుల్లో మట్టి తరలిపోతోంది. పక్క పచ్చని చెట్లు నెలకొరుతున్నాయి. అక్రమ మట్టి తవ్వకాలు జోరు పెరిగింది. చెరువుల్లో ఉన్న నల్ల మట్టిని కోసం భారీగా తవ్వకాలు చేస్తున్నారు. ప్రభుత్వభూమి, చెరువులు అనే తేడా లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా బట్టీలకు అగ్గి పెడుతున్నారు. కాలుష్యానికి కారకులవుతున్నారు.

సరిహద్దుల్లో పాగా.. ఊరంతా పొగ..!

- నిబంధనలకు విరుద్ధంగా ఇటుకల బట్టీలు
- కాలుష్యం బారిన ప్రజలు
- చెరువులు,ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఇటుక బట్టీ వ్యాపారం జోరుగా సాగుతోంది. పెనుకొండ, గోరంట్ల, సోమందేపల్లి, పరిగి, రొద్దం మండలాల్లో ఇటుక బట్టీలు అధిక సంఖ్యలో ఏర్పాటయ్యాయి. పెనుకొండ మండలంలో 100, సోమందేపల్లి మండలంలో 30 నుంచి 50, రొద్దం మండలంలో 25 నుంచి 40, పరిగి మండలంలో 35, గోరంట్ల మండలంలో 85 ఇటుకల బట్టీలు ఉన్నాయి. వీటిలో 80శాతం మంది పెద్ద షెడ్లు నిర్మాణం చేసి ఇటుకలు తయారు చేస్తారు. సాధారణ ఇటుక పరిమాణం 4.11 అంగుళాలు, సిమెంటు, ఫ్లైయాష్ సిమెంటు ఇటుకలు9. 11 అంగుళాల పరిమాణంలో ఉంటాయి. ఒక్క ఇటుక రూ.38 నుంచి రూ.40 వరకు పలుకుతోంది. మట్టి ఇటుకలు ఒక ట్రాక్టర్‌లో 2వేల వరకు వస్తాయి. ఒక్క ట్రాక్టర్ ఇటుకల ధర రూ. 12500 నుంచి రూ.13 వేల వరకు ఉంది.మట్టి ఇటుకలు వినియోగించడం వల్ల చల్లదనం ఉంటుందనే విశ్వాసం వినియోగదారుల్లో ఉంది.

నిబంధనలకు విరుద్ధంగా ఇటుకల బట్టీలు

నిబంధనలకు విదుద్ధంగా ఇటుకబట్టీలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇటుక బట్టీల ఏర్పాటుకు రెవెన్యూ, పంచాయతీ, కార్మికశాఖ, పరిశ్రమ శాఖ, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు ఉండాలి. ఇటుకల తయారీకి వ్యవసాయ భూములు లీజుకు తీసుకుని బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయేతర అవసరాలకు వినియోగించేందుకు అనుమతులు తీసుకుని ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సిఉంది. కొందరు ఎకరం నుంచి మూడు ఎకరాల వరకూ లీజుకు తీసుకుని పెద్ద ఎత్తున ఇటుకల బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండానే బట్టీలు నిర్వహిస్తున్నారని విమర్శలున్నాయి.

కాలుష్యం బారిన ప్రజలు

పుట్టగొడుగుల్లా పుటుకొస్తున్న ఇటుకల బట్టీలతో కాలుష్యం బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటుకల బట్టీల నుంచి వచ్చే పొగతో రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. పట్టణం, గ్రామాల సమీపంలో ప్రధాన మార్గాలకు అనుకుని రవాణకు అనుకూలంగా ఉన్న పంట పొలాల్లో ఇటుక బట్టీల వ్యాపారం యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఆయా బట్టీలు ఇళ్ల మధ్యలో, జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్నారు. ఇటుకలను కాల్చేందుకు వినియోగించే కట్టెలు, పొట్టుతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, పొగ, దుమ్ము కళ్లలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్ల పై వెళ్లే ప్రయాణికులు వాపోతున్నారు.

చెరువులు,ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు

మట్టిమాఫీయా చెరువుల్లో మట్టిని పెద్ద ఎత్తున తరలించి సొమ్ముచేసుకుంటోంది.కొందరు ఖాళీ స్థలాల్లో మట్టిని నిల్వ ఉంచుకుని అమ్ముకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాలు చేసి ప్రభుత్వఆదాయనికి గండి కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, నీటిపారుదల, మున్సిఫల్ శాఖ అధికారులు పట్టించుకున్న పాపన పోలేదు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు..

ఇటుక బట్టీలు కాల్చడానికి పెనుకొండ నియోజకవర్గం వ్యాప్తంగా కట్టెలనే ఉపయోగిస్తారు. అక్కడక్కడ కట్టెలతో పాటు ఊక పొట్టుని వినియోగిస్తున్నారు. ఆరు పొయ్యిలు ఉన్న ఇటుక బట్టీని కాల్చాలంటే దాదాపు 5 ట్రాక్టర్ల కట్టెలు అవసరమవుతాయి. దీంతో కట్టెల వ్యాపారం చేసుకునే వారు పెద్ద చెట్లను నరికి ఇటుకల బట్టీలకు అమ్ముకుంటున్నారు. తుమ్మ, వేప చెట్లను ఇష్టారాజ్యంగా నరికి తరలిస్తున్నా అటవీశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఏడాదికి ఒక సారి బట్టీల నిర్మాహకులతో మాముళ్లు తీసుకుని కళ్లుమూసుకుంటున్నారు.

అధికారులు స్పందించాలి: స్థానికులు

నివాసగృహాల సమీపంలో ఇష్టారాజ్యంగా ఇటుకల బట్టీలు ఏర్పాటు చేసి కాలుష్యం చేస్తున్న నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. పట్టణాలు, గ్రామాలకు దూరంగా బట్టీలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: అధికారులు

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇటుకల బట్టీలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని రెవిన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖ, అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు. పన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేసిన మట్టి మాఫియా



నిల్వ చేసిన మట్టి కుప్పలు

అన్ని ప్రాంతాల్లో దశలవారీగా ప్లాస్టిక్ నిషేధం

- ఉపాధి పనుల్లో పురోగతి చూపించాలి
- కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో దశలవారీగా సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తామని, దీనిపై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అన్ని శాఖల అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన బీట్ ద హీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ పూర్తి స్థాయిలో జరగాలన్నారు. జిఎస్‌డబ్ల్యుఎస్ అంశాలకు సంబంధించి పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి పనులను విరివిగా చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే నియమించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిపిఒ నాగరాజు నాయుడు, జెడ్పీ సీఈవో రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ సలీమ్ భాష, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుత్తిలో ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గుత్తి

మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గుత్తిలో ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలు లేక పేద విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, ప్రజలు ప్రభుత్వాలను కోరుతున్నా ఎవరు పట్టించుకోలేదన్నారు. ఈనెల 15న గుత్తికి రానున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మండలంపై దృష్టి సారించి ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను విద్యార్థులకు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు బాలాజీ, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-గుంతకల్లు


సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయరామ్

నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఉన్న 19 మంది లబ్ధిదారులకు మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం స్థానిక క్యాంపు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ రకాల ఆరోగ్య ఇబ్బందులతో చికిత్సలు పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సిఎం చంద్రబాబు రూ.8.57 లక్షలు మంజూరు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. అదేవిధంగా అభివృద్ధి పనులకు కోట్లాది నిధులు ఖర్చుచేస్తోందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు హంద్రీనీవా ప్రాజెక్టు కాలువ విస్తరణ పనులకు నిధులు కేటాయించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఆయా పనులను పరిశీలించేందుకే గత శుక్రవారం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామానికి సిఎం వచ్చారన్నారు. ఈనెల 15న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గుత్తి పర్యటన ను కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు తిమ్మప్ప చౌదరి, గుంతకల్లు ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు పత్తి హిమబిందు, నాయకులు మస్తాన్‌యాదవ్, ఆంజనేయులు, హనుమంతు, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వికలాంగుడి వినతి

ప్రజాశక్తి-బెలుగుప్ప

వికలాంగుడు అని చూడకుండా ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసి అన్యాయం చేసిన తన భార్యపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఓ వికలాంగుడు ఎస్ఐకు విన్నవించాడు. బాధితుడు ఫయాజ్ తెలిపిన వివరాల మేరకు.. బెలుగుప్ప ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు తాను గుంటూరు జిల్లా తెనాలికి చెందిన షేక్ షబానాతో వివాహమైనట్లు తెలిపారు. వివాహమైనప్పటి నుంచి జల్సాల కోసం డబ్బులు ఇవ్వమని వేధిస్తూ [illegible] గురి చేసేదన్నారు. ఈ క్రమంలో తనకు ఉన్న సొంతింటిని రూ.40 లక్షలు, ప్లాటును రూ.7లక్షలకు అమ్మించి ఆ డబ్బులను తన భార్య పుట్టింటి వారికి పంపించిందన్నారు. దీనితోడు 2023 డిసెంబర్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో రూ.30 లక్షలు పర్సనల్ లోన్ తీసుకుని ఇచ్చానన్నారు. ఈనేపథ్యంలో ఏప్రిల్ 28వ తేదీ రాత్రి గొడవ పడి 29న పుట్టింటికి వెళ్లిందన్నారు. వెళ్లిపోతూ తన కారుతోపాటు ఇంటి సామాను, తనకు సంబంధించిన సర్టిఫికెట్లను తీసుకెళ్లిందన్నారు. కావున విచారణ చేపట్టి తన భార్యతోపాటు ఆమె అక్క, తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని ఎస్ఐ శివకు ఫిర్యాదు చేశారు.

జనాభా ప్రాతిపదికన బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న పోతుల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం

జనాభా దామాషా ప్రకారం అన్నిరంగాల్లో బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (ఆర్‌పిఎస్) వ్యవస్థాపకులు పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో సామాజిక న్యాయం అమలు కావాలంటే జనాభా నిష్పత్తి ప్రకారం అన్నిరంగాలలో వాటా దక్కాలన్నారు. కావున జనాభాలో 56 శాతం ఉన్న బీసీల చట్ట సభలు, విద్య, ఉద్యోగాల్లో 43 శాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు చిరుతల విఠల్‌గౌడ్, ఆర్‌పిఎస్ జాతీయ నాయకులు జి.నాగభూషణ, రాష్ట్ర కన్వీనర్ ఆర్.నారాయణనాయక్, రాయలసీమ కన్వీనర్ నాగభూషణ, రాష్ట్ర నాయకులు ఎర్రిస్వామి, వరదరాజులు, ఆర్.నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు స్థానాలు కేటాయించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ముందుగా స్థానాలు కేటాయించిన తర్వాతే సబ్జెక్టు ఉపాధ్యాయులకు పిఎస్ హెచ్‌ఎంలుగా కన్వర్షన్‌గానీ, ఎస్‌జిటిలకు పదోన్నతులు నిర్వహించి భర్తీ చేయాలని ఎపిపిఎస్‌హెచ్‌ఎ నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్‌లో డిఇఒ సురేష్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిపిఎస్‌హెచ్‌ఎ నాయకులు మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరంలో నూతనంగా ఏర్పాటు చేయబోతున్న ప్రతి ఆదర్శ, ప్రాథమిక పాఠశాలలకు మంజూరు చేసిన ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులను త్వరలో జరగబోయే ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రస్తుతం పని చేస్తున్న ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులకు ముందుగా స్థానాలు కేటాయించాలన్నారు. ఆ తర్వాతే సబ్జెక్టు ఉపాధ్యాయులకు పిఎస్ హెచ్‌ఎంలుగా కన్వర్షన్ కానీ ఎస్జీటీలకు పదోన్నతులు నిర్వహించి భర్తీ చేయాలని కోరారు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో

M.V.O.P No.211/2024

యం.పుల్లా నాయుడు మరియు వగైరా ... అర్జీదారులు

-వర్సెస్-

వై.జరీనా మరియు వగైరా ... రెస్పాండెంట్లు

1,3 రెస్పాండెంట్లకు నోటీసులు

1. ఎలుకూరు జరీనా తండ్రి హుసేనప్ప, కారు ఓనరు, బేరింగ్ నెం.ఎ.పి.02 బి.డి.2556, ఇంటి.నెం.6-4-731,రామ్‌నగర్, 5వ రోడ్డు, అనంతపురము టౌన్ మరియు జిల్లా.
3. ఎద్దుల చిన్న క్రిష్ణ తండ్రి వై.సూర్యనారాయణ, కారు డ్రైవర్,బేరింగ్ నెం.ఎ.పి.02 బి.డి.2556, ఇంటి.నెం.1/542,రుద్రంపేట గ్రామం, అనంతపురము టౌన్ మరియు జిల్లా.

పై నంబరు M.V.O.P లో సోమశేఖర్ నాయుడు 30-8-2017 వతేదిన రోడ్డు జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయినాడని అతనికి నష్టపరిహారం రూ. 15,00,000/-లు,ఇందుపైన యం.వి.ఓ.పి కోర్టులో దాఖలు చేసిన రోజు నుండి 12% ప్రకారం వడ్డీ మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ అర్జీదారులు అర్జీదాఖలు చేసినారు. ఇందులో 1,3వ రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 30-6-2025 వ తేది ఉదయం10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానింప బడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 30-6-2025

యం.మహవిష్ణు,
బి.సుబ్బరాయుడు,
బి.ఇ.సురేంద్రగౌడు
అర్జీదారుల పరం అడ్వకేట్లు,
కర్నూలు.

ఎమ్మెల్యేగా తొలి ఏడాదిలోనే 450 మందికి ఉపాధి

జెసి అస్మిత్‌రెడ్డి ప్రత్యేక చొరవ... యువతకు ఉద్యోగాలు..!

ప్రజాశక్తి-తాడిపత్రి


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి


జెసి అస్మిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదటి సంవత్సరంలోనే నియోజకవర్గంలోనికి దాదాపు 450 మంది యువతకు ఉపాధి కల్పించారు. ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచే యువతకు పెద్దఎత్తున ఉపాధి చూపించాలని లక్ష్యంతో నైపుణ్యం యాప్‌ను ఏర్పాటు చేశారు. యాప్‌లో ఉపాధి కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుని పలు సంస్థలను తీసుకొచ్చి జాబ్‌మేళా ఏర్పాటు చేసేందుకు ఓ ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగానే మంగళవారం పట్టణంలోని శ్రీవాణి విద్యాసంస్థల్లో జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో నైపుణ్యం యాప్‌లో 1800 మంది దరఖాస్తు చేసుకోగా 1,300 మంది హాజరయ్యారు. ఇందులో 450 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నైపుణ్యం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న యువతీ, యువకులకు రూ.25వేల రూపాయల నెలసరి వేతనంతో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ప్రస్తుత నిత్యావసర సరకులు, ఇంటి అద్దెల దృష్ట్యా నెలసరి వేతనం తక్కువ అయినప్పటికీ నిరుత్సాహ పడకుండా ముందుకు సాగితే మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు. జీతం గురించి ఆలోచించకుండా జాబు ఎంపికైన వారు జావులలో కొనసాగాలని. ప్రతిభను బట్టి మరింత ఎదుగుదల ఉంటుందన్నారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలి

కౌలు రైతుసంఘం జిల్లా నాయకులు వెంకటేసులు

ప్రజాశక్తి-ఉరవకొండ

అప్పుల బాధ భరించలేక ఇటీవల విడపనకల్లు మండలంలో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాలకు రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని కౌలు రైతుసంఘం జిల్లా నాయకులు పెద్దముష్టూరు వెంకటేశులు డిమాండ్ చేశారు. మంగళవారం ఉరవకొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారంరోజుల వ్యవధిలోనే నియోజకవర్గ పరిధిలో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. విడపనకల్లు మండలంలో పాల్తూరు గ్రామానికి చెందిన కౌలు రైతు బోయ సుధాకర్, పెద్దకొట్టాలపల్లి గ్రామంలో హరిజన రాముడు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నారు. అదేవిధంగా ఉరవకొండ మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన హరిజన ఎర్రిస్వామి, వజ్రకరూరు మండల పరిధిలోని వెంకటంపల్లి పెద్దతండాకు చెందిన రైతులు సోమ్లానాయక్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారన్నారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల వద్దకు వెళ్లి సమగ్ర విచారణ చేపట్టి ఆయా కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం మోపిడి రేణుమాకులపల్లి అధ్యక్ష, కార్యదర్శులు సుంకన్న, సురేష్, రామ్మూర్తి, కౌలు రైతులు అశ్వర్థనారాయణ, ప్యాపిలి ఎర్రిస్వామి, వెలిగొండ ఓబయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కౌలు రైతుసంఘం జిల్లా నాయకులు

'కిశోరి వికాసం'తో సంపూర్ణ సాధికారిత

ప్రజాశక్తి-ఉరవకొండ

కిశోరి వికాసంతోనే సంపూర్ణ సాధికారత సాధ్యమవుతుందని ఐసిడిఎస్ ఉరవకొండ ప్రాజెక్ట్ సిడిపిఒ శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాకెట్ల గ్రామం అంగన్వాడీ సెంటర్లలో కిషోర వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ సమాజం అనేక రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బాలికలు మూఢనమ్మకాలను విడిచిపెట్టి పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కుటుంబ సభ్యులు దేశాన్ని కాపాడే వీర వనితలగా బాలికలను తీర్చిదిద్దాలన్నారు. అనంతరం రుతుస్రావ సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిడిపిఒ ఎల్లమ్మ, సూపర్‌వైజర్ రబియా, మహిళా పోలీస్ రామాంజినమ్మ, ఎఎన్ఎం పద్మావతి, అంగన్వాడీ కార్యకర్తలు రామాంజినమ్మ, అన్నపూర్ణ, చంద్రకాంత, జయమ్మ, సుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.


ఉరవకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు, కిశోర బాలికలు


శింగనమలలో అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి

నార్పల : మండల కేంద్రంలోని ఉయ్యాలకుంట అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం కిషోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ భారతి కిషోర బాలికలకు బాలల చట్టాలు, బాలికా సంరక్షణ చట్టాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ భారతి, ఇఒఆర్‌డి శైలజారాణి, సూపర్‌వైజర్లు సునాలిని, మధుమాలిని, రాజమణి, శాంతమ్మ, లావణ్య, అంగన్వాడీ కార్యకర్తలు శ్రీదేవి, భారతి, జరీనాబేగం, రామాంజనమ్మ, నాగమణి, కిషోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : కిషోర బాలికలకు పోక్సో చట్టంతోనే రక్షణ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉల్లికల్లు అంగన్వాడీ కేంద్రంలో కిషోర వికాసం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి అపర్ణ, లోకేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు శివలక్ష్మి, రాజేశ్వరి, మహాలక్ష్మి, కిషోరి బాలికలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవి.రాఘవరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల యూనియన్ (327) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవి.రాఘవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సునామ జకనీమాత ఆలయ ఆవరణలో ఉన్న కల్యాణ మండపంలో విద్యుత్ ఉద్యోగుల యూనియన్ డివిజన్ స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. విద్యుత్ సమస్యలను విద్యుత్ శాఖ కార్యదర్శి విజయనంద్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎం నారా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం ఆయన సమక్షంలో విద్యుత్ ఉద్యోగుల యూనియన్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షులుగా లైన్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి, కార్యదర్శిగా శేషహోలి, వర్కింగ్ అధ్యక్షుడిగా మంజునాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకట రామిరెడ్డి, కోశాధికారిగా రామాంజనేయులుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవి.రాఘవరెడ్డి

శేష వాహనంపై వెంకటరమణస్వామి


శేషవాహనంపై విహరిస్తున్న ప్రసన్న వెంకటరమణస్వామి

రాయదుర్గం : ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి శేష వాహనంపై విహరించారు. కోటలో నుంచి వినాయక కూడలి మీదుగా బళ్లారి రోడ్డు పాండురంగస్వామి దేవాలయం వరకూ ఊరేగింపు సాగింది. ఈ కార్యక్రమంలో కుర్నిశెట్టి, స్వకులసాలీ సమాజం, స్మార్ట్ ఫ్రెండ్స్ గ్రూపు సంఘాల వారు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్‌కు సన్మానం

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ శాఖ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్‌ను మంగళవారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిరాయితీ గౌస్‌మోద్దీన్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గౌస్‌మోద్దీన్ మాట్లాడుతూ టిడిపి విధేయులకు ఎప్పుడూ అండగా ఉంటుందని మరోసారి రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బుల్లే రామకృష్ణ, పప్పూరు లక్ష్మీనారాయణ, బాబు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో ఫారంపాండ్ తవ్వుకున్నా..

పుట్లూరు : తన పొలంలో సొంత ఖర్చులతో ఫారంపాండ్‌ను తవ్వుకుంటున్నానని రైతు భైరవేశ్వరెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ అలివేలమ్మకు వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకం కింద హిటాచీతో ఫారంపాండ్ తవ్వుకుంటున్నట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తన అవసరాల కోసమే సొంత నిధులు వెచ్చించి తవ్వుకుంటున్నానని వివరించారు.

తారురోడ్డు ప్రారంభం

యాడికి : రాయలచెరువు నుంచి చందన వరకూ నూతనంగా నిర్మించిన తారురోడ్డును మండలంలోని చందన గ్రామంలో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన చందన, రాయల చెరువు రోడ్డును టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే పూర్తి వేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, చందన సర్పంచు రామాంజనేయులు, గంగిరెడ్డి రవికుమార్‌రెడ్డి, చలమారెడ్డి, నాగమునిరెడ్డి, చందన మాజీ సర్పంచు సూర్యనారాయణరెడ్డి, పరిమి చరణ్, మెకానిక్ బాబు, పరిమి శ్రీహరి, నరసింహచౌదరి, నీలకంఠారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

యాడికి : మండల కేంద్రంలోని సంత మార్కెట్‌లో ఉన్న రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై మంజూరైన పశువుల దాణాను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఎడి కబీర్‌బాషా మాట్లాడుతూ 50 శాతం రాయితీపై రైతులకు పశువుల దాణా అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, ఐ టీడీపీ అధ్యక్షులు నరసింహ చౌదరి, వెటర్నరీ డాక్టర్ విజయలక్ష్మి, సుబ్బారెడ్డి, తెలుగు యువత నాయకుడు నీలకంఠారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం

గుంతకల్లు : నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలు చేస్తామని డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కసాపురం రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం డీఎస్సీ పరీక్షల ప్రిపరేషన్ కోసం 90 రోజులు సమయం పెంచాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా నిరుద్యోగ భృతి అమలు చేయాలన్నారు. జిల్లాలో ఉపాధి కల్పించే పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి రాబోయే రోజుల్లో పోరాటాలను కొనసాగిస్తామన్నారు.


దళిత రైతులకు న్యాయం చేయాలని వినతి

శింగనమల : మండల పరిధిలోని నిదనవాడ గ్రామంలో ఎస్సీ రైతులకు న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1999లో 15 మంది ఎస్సీ రైతులకు సర్వే నెం.213, 214లో ఒక్కొక్కరికి రెండెరాల చొప్పున ప్రభుత్వం డీ.ఫారం పట్టా మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి రైతులు సాగు చేసుకుంటూ బ్యాంకు రుణాలు పొంది జీవనోపాధి పొందుతున్నారన్నారు. అయితే రీసర్వే పేరుతో సర్వే నంబర్లు మార్పు చేసి ఆ భూమిని మిగులు భూమిగా అధికారులు చూపించారన్నారు. కావున సంబంధిత భూమిని సర్వే చేయించి అర్హులైన దళిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు నేరిమెట్ల ఎల్లన్న, బండారు కుళ్లాయప్ప, ఎంఎస్ఎఫ్ నాయకులు నగేష్, రమేష్, రైతులు మునీంద్ర, లక్ష్మీనారాయణ, కుళ్లాయిస్వామి, నాగప్ప, పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష


పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ అలివేలు అధ్యక్షతన పంచాయతీల జనాభాపై మండలంలోని కార్య దర్శులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రూ.10వేలకుపైన జనాభా ఉన్న పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్, 4వేల నుంచి 10వేల వరకూ జనాభా ఉన్న పంచాయతీలకు గ్రేడ్ వన్, 2వేల నుంచి 4వేల వరకూ జనాభా ఉన్న పంచాయతీలకు గ్రేడ్ 2, 2వేల నుంచి 1500 జనాభా ఉన్న పంచాయతీలకు గ్రేడ్ 3గా ఎంపిక చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఏఏ పంచాయతీలో ఎంత జనాభా ఉంది.. ఏ పంచాయతీకి ఏ గ్రేడ్ వస్తుందనే విషయాలు తెలుసుకనేందుకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో 23 పంచాయతీలు ఉండగా పుట్లూరు, కడవకల్లు పంచాయతీలు గ్రేడ్ వన్‌గా ఎంపిక చేశారని, వెల్లుట్ల పంచాయతీనిగ్రేడ్ 2 గా, మిగిలిన పంచాయతీలను గ్రేడ్ 3గా ఎంపిక చేసినట్లు తెలిపారు.

సంసిద్ విద్యార్థుల సత్తా


సత్తా చాటిన విద్యార్థులు

అనంతపురం : 10, 12వ తరగతుల బోర్డు పరీక్ష ఫలితాల్లో వందశాతం విజయంతో సంసిద్ విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ మధుమిక తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ అనంతపురంలోని సంసిద్ స్కూల్‌లోని 10, 12 తరగతుల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రకటించడానికి గర్వంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి పరీక్షల్లో అద్భుతమైన ప్రతిభను కనబరిచారన్నారు. అద్భుతమైన విద్యార్థుల అత్యుత్తమ పని తీరుకు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో టీం సంసిద్ - టాటా క్లాస్‌ఎడ్జ్ ఫలితాలు, ఉత్తేజాన్ని విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందిస్తాయని తెలిపారు.

రోజూ చెత్త సేకరించాలి : కలెక్టర్


పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం కార్పొరేషన్ : పారిశుధ్య సిబ్బంది రోజూ 6 గంటలకే ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. మంగళవారం అనంతపురంలోని నిర్మలానంద నగర్ పరిధిలో చేపట్టిన పారిశుధ్య పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కమర్షియల్ ఏరియాల్లో రోజూ చెత్తను తొలగించాలన్నారు. శానిటేషన్ సెక్రటరీలు సెట్స్ (వాకీటాకీ)లను ఉపయోగిస్తూ ప్రతి 350 ఇండ్లకు చెత్తను సేకరించేందుకు ఒక మైక్రో పాకెట్ అటెండర్, 2 వర్కర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. వాణిజ్య సముదాయాల నుంచి తడి, పొడిచెత్తకు వేర్వేరుగా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. షాపుల బయట చెత్త కనిపిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సచివాలయాల వారీగా ఎన్ని గృహాలు ఉన్నాయి.. అందులో ఎంతమంది శానిటేషన్ వర్కర్స్ ఉన్నారనే నివేదికలను తయారు చేసి ఇవ్వాలన్నారు. శానిటేషన్ వర్కర్లు తక్కువగా ఉన్నచోట కొత్తవారిని నియమించేందుకు మున్సిపల్ సమావేశంలో నిర్ణయం తీసుకుని నివేదకలు సమర్పించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి హెల్త్ ఆఫీసర్ నరసింహ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్, శానిటేషన్ సెక్రటరీ తాసీఫ్ శర్మాస్, తదితరులు పాల్గొన్నారు.


59వ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం


సర్వసభ్య సమావేశానికి హాజరైన అతిథులు, పాస్టర్లు

అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన మంగళవారం 59వ సర్వసభ్య సమావేశం, దేవునికి మహిమకరంగా సాగింది. ఉదయం ప్రారంభ ప్రార్థన పాస్టర్ మార్క్ చేశారు. వచ్చిన దైవజనుల పాటలు పాడి దేవుని నామాన్ని మహిమ పరచారు. పాస్టర్ పి.మార్క్ స్తుతి ఆరాధన చేయించగా, అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు, ముఖ్య ప్రసంగీకులు రెవ గాలి గంగరాజు (ది బైబిల్ ఫౌండేషన్- తిరుపతి) సేవకులకు పరిచయం చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు గారు వచ్చిన ముఖ్య ప్రసంగీకులను గురించి వివరించారు. తర్వాత దేవునితో ఎలా గడపాలనే విషయాలను బైబిల్ మిషన్ ఎజి గౌరవ అధ్యక్షులు బందెల రాజు వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారులు చల్లా కిషోర్‌చౌదరి, వైపి బాబు, పాస్టర్ శామ్‌సన్ నాయక్, పాస్టర్ గిద్యోన్, పాస్టర్ వీరేష్, కమిటీ సభ్యులు పాస్టర్ జీవన్‌బాబు, పాస్టర్ మనసే, పాస్టర్ జాషువా జహంగీర్, పాస్టర్ శాంత వర్ధన్, పాస్టర్ విజయ్‌సింహా, తదితరులు పాల్గొన్నారు.

వెంకటశివుడు యాదవ్‌కు సన్మానం


వెంకటశివుడు యాదవ్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

ఇటీవల ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్‌ను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, చిన్న ఆంజనేయులు, బండి పరశురాం, బెస్త నారాయణస్వామి, మల్లి, తరిమెల పుల్లయ్య, యోగా, తదితరులు పాల్గొన్నారు.

'వైసిపి నాయకుల ప్రమేయం లేదు'

పెద్దవడుగూరు : మండలంలోని లక్షుంపల్లిలో రెండు రోజుల క్రితం గడ్డివామిని కాల్చిన ఘటనలో వైసిపి నాయకుల ప్రమేయం లేదని బాధితుడు చిన్నసుబ్బయ్య. మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. గడ్డివామిని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మాత్రమే కాల్చివేశారని పోలీసులకు కూడా సమాచారం అందించామన్నారు. అంతేగానీ ప్రత్యేకంగా ఒకరి ప్రమేయం ఉందని చెప్పలేదన్నారు.

లోకేష్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈనెల 15న గుత్తి మండలానికి రానున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా పట్టణ శివారులోని మాసినేని పాఠశాల ఎదురుగా చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే బేతాపల్లి గ్రామం వద్ద సోలార్ ప్లాంట్‌కు భూమిపూజ చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించి ఇందుకు సంబంధించిన సలహాలు, సూచనలను అందజేశారు. ముందుగా ఎపి కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ జి.వెంకటశివుడు యాదవ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ విజయలక్ష్మి, ఆర్‌అండ్‌బి డిఇఇ సత్యనారాయణ, తహశీల్దార్ డి.ఓబిలేసు, సిఐ బి.వెంకటేశ్వర్లు, సర్పంచు భరత్‌కుమార్, టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు బర్దివలి, ఎంకె.చౌదరి, నాయకులు గోవర్ధన్‌గౌడ్, జక్కలచెరువు ప్రతాప్, చికెన్ శీనా, బి.రమేష్, ఆర్.సాలమన్‌రాజా, తదితరులు పాల్గొన్నారు.


లోకేష్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్